

# నాకు నీవు- నీకు నేను

**- దానం శివప్రసాదరావు**

"నీ పేరేమిట్రా అబ్బాయ్! ఎవర బ్బాయివి?"

నాగిరెడ్డి. అనంతరామిరెడ్డి వాళ్ళ అబ్బాయిని.

తారు రోడ్డుమీద టైర్ల బండి, ఎద్దుల బండి, ట్రాఫిక్ లేకపోవడంతో కాస్తంత వేగంగానే పోతున్నాయ్ ఎడ్లు. ఈయేడు పంటలు ఫర్వాలేదా?

"మిర్చి, పత్తి అనుకున్నంత దిగుబడి లేదండి. మడ చేలల్లో బోర్ల క్రింద పర్లేదండి.

పెద్ద కాలవ పక్కనే ఉన్నా- నీటిఎద్దడి ఉందంటారా?

"మరేనండి."

ఔనా అబ్బాయ్! నాగిరెడ్డీ! గంగానమ్మ గుడిదగ్గర పొలాల రేట్లు బాగున్నాయట కదా. "ఔనండి... గుంటూరు వాళ్ళు వచ్చి రేట్లు పెంచారండి." అక్కడ హైదరాబాదు వాళ్ళు ఫ్యాక్టరీ కడ్తారంట.

"మరె! ఔనూ! గంగానమ్మ గుడి- ఊరి ముందు, అలానే ఉందా! కాస్తంత బాగుందా ఇప్పటికైనా!

ఏదో చెప్తున్నాడు నాగిరెడ్డి.

కమాండర్లు, జీపులు, టూవీలర్స్. అడపాదడపా ఎర్ర బస్సులు అటూ, ఇటూ వెళ్ళిపోతూనే ఉన్నాయి. చుట్టూ కనుచూపుమేర పొలాలే దుప్పట్లు పరిచినట్లు. తన స్వగ్రామం. కుగ్రామం. ఆనాడు అంతా కాలి దోవలు. మట్టి రోడ్లే. ఇప్పుడు తార్రోడ్లు. దూరంగా చేలగట్లపై వరుసలుగా తాటి చెట్లు.

'పిల్లుట్ల' నుంచి బైల్దేరింది ఎద్దుల బండి. సాయంత్రం ఐదుగంటలు కావొస్తోంది. సూర్యకిరణాలు పంటచేలపై పడుతూ కాంతులీనుతున్నాయి. రోడ్డుకిరువైపులా చెట్లు కూడా లేకపోవడంతో సాయంత్రపుటెండ రాఘవరావు, భాగ్యమ్మల మీద పడ్తోంది.

"అయినా ఏమిటి ఈయనగారి పిచ్చి! శుభ్రంగా ఊళ్ళో దాకా బంగారంలా ఏవోక వాహనాలు ఉండే. ఈరోజుల్లో కూడా ఈయనగారికీ ఎద్దులబండి పిచ్చేమిటో!" చాదస్తం కాకపోతే! ఒళ్ళంతా హూనమైపోతూండే. పొలాల్లో పని చేసి వస్తూన్నట్లుగా ఏమిటీ చోద్యం!"

ఆమాత్రం భాగ్యమ్మగారి భావాలు తెలీకపోలేదు రాఘవరావుగారికి.

"చూడూ భాగ్యం! అరవై ఐదేళ్ళవాణ్ణి నేను హాయిగా కూర్చున్నాను. నువ్వు నాకంటే పదేళ్ళు చిన్న. నాకంటే హుషారుగా ఉండొద్దూ!" కాస్తంత దీర్ఘంతీసాడు రాఘవరావు.

"మరె! ఇప్పుడు హుషారుగా ఉండే కాలమే" పుల్ల విరిచినట్లు మూతి అదోమాదిరిగా వంకర తిప్పుతూ అంది భాగ్యమ్మ.

సామాన్లు ఈసారికి పల్లె చేరుకునే ఉంటాయి.

ఎద్దుల మెడల్లోని గంటలు లయబద్ధంగా విన్పిస్తున్నాయి.

'ఇంకెంత దూరముంటుందోయ్ నాగిరెడ్డీ!'

పిల్లుట్లకీ మనకీ ఆరు మైళ్ళండీ! సగం వచ్చేశాం. చీకటి పడేలోపుగానే వెళ్తాం.

ఆరు మైళ్ళు! మైళ్ళు... మైళ్ళు... ఎన్నాళ్ళయ్యిందో దూరపు కొలమానం మాట విని?

పొలాలపైనుండి వచ్చే విసురు గాలి. పొద్దువాలుతున్న కొద్దీ గాలి చల్లగా ఉంది. భాగ్యమ్మ చెవులకు చీరె కొంగు కప్పుకొంది.

'మరే! న్యూజెర్సీ వెళ్ళినప్పుడు చూసాను. సిటీ దాటి ఔట్ స్కర్ట్స్‌లో, ఫాంలాండ్స్‌లో ఎంత దూరం ప్రయాణంచేసినా అంతా ఎలక్ట్రిసిటీనే. చీకటనిపించదు. భాగ్యమ్మ అంది.

నవ్వాడు రాఘవరావు. ఖద్దరు చొక్కా, అంచు పంచె, తెల్లటి ఉత్తరీయం. చామన చాయ రంగు. భాగ్యమ్మ తెల్లని తెలుపు. ప్రయాణపు బడలిక స్పష్టంగా కానొస్తోంది. రాఘవరావుది మంచి ఆరోగ్యం. అడపా దడపా వాహనాల్లో వెళ్ళేవాళ్ళు. టైర్ల ఎద్దులబండి మీద ప్రయాణిస్తున్న వీరిని కన్పించినంత సేపు కాస్తంత ఆశ్చర్యంగానే చూసుకుంటూ పోతున్నారు.

ఆ న్యూజెర్సీలో, మన గుంటూర్లోనూ ఏముందోయ్! ఇక్కడ చూడు! ఎంత బావుంటుందో... అంతలో దగ్గు తెర వచ్చింది. వాటర్ బాటిల్ అందించింది భాగ్యమ్మగారు.

"ఇక్కడ మందులు, మాకులు ఏం దొరుకుతాయని! ఇదేమన్నా టౌనా! సిటీనా!"

'అసలిక వాటిల్తో పనుండదు లేవోయ్!'

సూరీడు మెల్లగా పశ్చిమాద్రిలోకి పయనంచేస్తూ జారుకుంటున్నాడు.

ఎండ ఛాయ తగ్గింది. ఆకాశం పసుపు-ఎర్రని కాంతితో తెల్లని మేఘాలను శోభాయమానంగా ప్రకాశింపచేస్తున్నాయి పశ్చిమాద్రిన.

అద్భుతమైన ప్రకృతి. ప్రశాంత వాతావరణం. పంట పొలాలపై ఎగురుతూ గూళ్ళకు చేరబోతున్న పక్షుల గుంపు వరుసలు. దూరంగా పొలాల్లో శ్రమజీవుల కేకలు, ఇంజన్లలోంచి పడ్తున్న నీటి ధారలు, చిన్న చిన్న కాలువలు, పొలాల గట్ల వెంట. రోడ్డుకు ఇరువైపులా ... రేగు చెట్లు. జనవరి నెల కావడంతో చెట్లకు పండిన రేగు పండ్లు.

తెల్లటి ఊలును పులుముకున్నట్లుగా దట్టమైన అడవి బంతి పూల మొక్కలు. ఆకుపచ్చని తంగేడు మొక్కలపై పసుపచ్చని పూల గుత్తులు.

అవి... అవి... అవే! సంక్రాంతినాడు గొబ్బెమ్మల్లో పసుపు కుంకుమలు చల్లి పెట్టే పూలు. పనీపాటలు చేసుకుని ఇళ్ళకు చేరేటప్పుడు జడలో తురుముకునే పూలు.

బతుకమ్మ పండుగకు తంగేడు పూల శోభ అంతా ఇంతా కాదు. ఊరు మధ్య 'గురవయ్య' వాళ్ళ ఇంటి ముందు పేద్ద అరుగు. విశాలంగా ఉంటుంది. పిల్లల ఆటలన్నీ అక్కడే. ఆ రోజుల్లో సాయంత్రం పంచాయతీ రేడియో వినేటందుకు ఊళ్ళో వాళ్ళు చేరే అరుగు. నాటకాలు, డ్రామాలు అక్కడే.

బతుకమ్మ పండుగ రోజు ఊళ్ళోని ఆడవాళ్ళు తంగేడు పూలతో అలంకరించిన వెదురు బుట్టలను తీసుకొని, దీపాలు వెలిగించి, పాటలు, ఆటలు, మంగళ హారతులు ఇస్తూ వేడుకగా ఉంటుందా 'అరుగు'.

రాఘవరావు మనసు అనుభూతులతో నిండిపోతోంది. చిన్ననాటి నేస్తాలు ఆటపాటలు, ఈతలు అన్నీ ఓవైపు ముసురుతూండగానే-

గుంటూరులోని గతం... నిన్నటిదాకా తనకెదురైన జీవితానుభవాలు ఎంతవద్దనుకుంటున్నా మరోవైపున తొలుస్తూనే ఉన్నాయి.

గుంటూరు టౌన్లో నలభై ఐదేళ్ళ జీవితం. అంతా ఓ నాటకంలా- కలలా అన్పిస్తోందిప్పుడు. ఆ రంగం ముగిసింది. మరో అంకానికి తెర లేచింది. చివరకు నా స్థలానికి నేను ఒంటరిగా వచ్చాను.

బంధాలు! మమకారాలు! అంతా 'ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే వింత నాటకం'లానే అన్పిస్తోంది. ఎవరికి వారే! ఇదుగో తాళికట్టిన భార్య- నాలో సగం కాబట్టి నా అడుగులో అడుగేస్తూ వచ్చింది.

సరిగ్గా నలభై ఐదేళ్ళ క్రిందట ఇద్దరమే- ఇలానే బండి మీద పిల్లుట్ల దాకా వెళ్ళాం. అక్కడ నుంచి గుంటూరుకు ప్రైవేట్ బస్సుల్లో. ఆనాడు రవాణా మార్గాలు అంతంత మాత్రమే. మరలా ఇద్దరమే స్వంత గూటికి, వదిలివెళ్ళిపోయిన చోటుకు వచ్చేస్తున్నాం.

తాతలనాటి ఇల్లు ఉంది. అది చాలు. అదే స్వర్గం. అంతో ఇంతో పెన్షన్... ఇక్కడ ఇంతవరకు పోగొట్టుకోకుండా ఉన్న ఐదెకరాల భూమి. ఎంతమంది ఊళ్ళో వాళ్ళు తన దగ్గరకు వచ్చి అమ్మమన్నా అమ్మలేదు. 'చీదెళ్ళ పెదరత్తయ్య' నాటినుండీ నేటివరకు 'కవులుకు' చేస్తున్నాడు. చాలు! ఉన్నంతలో అసంతృప్తి లేదు.

తను ఉద్యోగార్థం భార్యతో ఊరు విడిచే నాటికి తనకు ఇరవై ఐదేళ్ళు. జిల్లా బోర్డు స్కూళ్ళు ఆనాడు. ట్రెయినింగ్

అయిపోగానే గుంటూర్లోనే స్కూల్ టీచరు పోస్టింగ్ వచ్చింది.

ఆయుర్వేద వైద్యమూ తనకు వంశపారంపర్యంగా అబ్బిన ఉప వృత్తి. ఏ యోగ బలమో తన కృషి ఫలితమో అటు వైద్యునిగా ఇటు ఉపాధ్యాయునిగా రాణించాడు. పైగా చిన్ననాటి నుండీ ఇతిహాస పురాణాలపై తనకున్న పట్టు, అభిరుచి సంఘంలో తనకు ఓ ప్రత్యేకతను సాధించుకునేలా చేసాయి.

నల్గురూ కొడుకులే. అందరినీ చదివించాడు. పెళ్ళిళ్ళు చేసాడు ఘనంగానే. తనూ రిటైరైపోయాడు. పెద్దవాడు, నాల్గవవాడు డాక్టర్లు. గుంటూరు టౌన్లోనే ప్రైవేటు ప్రాక్టీస్. మూడవవాడు 'విశాఖ'లో బ్యాంక్ ఆఫీసర్. రెండవ వాడు అమెరికా న్యూజెర్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పెద్దవాడు, నాల్గవవాడు తనతోనే ఉమ్మడిగా. మనుమలు, మనవరాళ్ళు, వియ్యంకుల రాకపోకలు, పండుగలు, పబ్బాలు- బంధుగణాల రాకపోకలు అంతా సందడే. అందరూ భాగ్యమ్మగారిని 'నీకేనమ్మా... మహరాణివి' అనేవారు. ఆ కుటుంబానికి టౌన్లో ప్రత్యేక గుర్తింపు. గౌరవ ప్రతిష్టలు.

అంతా సాఫీగా ఒకేలా సాగిపోతూంటే అది కాలధర్మం కాదుగదా! కాలం తెచ్చే మార్పులు కుటుంబాల్లో. వ్యక్తిత్వాల్లో చోటుచేసుకున్నాయి. అయితే ఆ మార్పులు రాఘవరావుగారి విషయంలో అనుకోని రీతిలో అనూహ్యంగా వచ్చి పడ్డాయి.

చివరకు ఎంతదాకా వచ్చిందంటే అందరూ ఉండి రాఘవరావు దంపతులు ఒంటరివారైయ్యారు.

పెద్ద కుటుంబం. ఉమ్మడి జీవనం. ఖర్చు బాగానే ఉండే వైనం. కాల గమనంలో ఆర్థికబంధాలు ఉమ్మడి జీవనానికి ప్రతిబంధకాలై పోయాయి. వ్యష్టి కుటుంబాలకు దారితీసాయి. సహజమే అది! ఆ దంపతులకు తెలియంది కాదు. భాగ్యమ్మలో ఓర్పు- సంయమనం ఎక్కువే. ఇంటెడు చాకిరీ తనే చేస్కునేది. క్రొత్త తరానికే ఏ విషయంలోనైనా పెద్దపీట వేసేది.

రాఘవరావు రిటైరైనా ఒకరికివ్వడమే కానీ, స్వంతవారి నుండి కూడా పైసా ఆశించని తత్వం. ఇద్దరిదీ సర్దుబాటు ధోరణే. 'కోపం-విసుగు' నరాలు ఏనాడో తెంపేసుకున్నారు.

గుంటూరు మీదే మమకారం ఎక్కువ. స్థిరపడిపోయింది అక్కడే కాబట్టి. భాగ్యమ్మ రెండో కొడుకు దగ్గరకు అమెరికాకు రెండుసార్లు వెళ్ళి వచ్చింది. అక్కడి కొడుకు కోడలి అవసరాలనుబట్టి, ఆప్యాయతలను బట్టి.

ఎవరి భవిష్యత్ ప్రణాళికలు వారివి. పెళ్ళై పిల్లలు పుట్టాక ఎవరి బాగోగులు వారివేనన్న ఆలోచనలు బైల్దేరాయి. మనస్పర్థలు, అభిప్రాయ బేధాలు మొదట్లో రావడం, సమసిపోవడం మామూలే. కాలం గడిచేకొద్దీ పందాలు పట్టింపులు.

అంత పెద్ద కుటుంబ నిర్వహణ ఏ ఒక్కరో మోయలేని మాట వాస్తవమే.

అందరి ఆలోచనలు, పోకడలు ఒకేలా ఉండవు. ఈ నేపథ్యంలో చీకాకులు, సమస్యలు, మనస్పర్థలు భూతద్దంలో చూసుకోవడం అలవాటైన మూలాన- తనతో ఉండే కొడుకులిద్దరూ వేరు కుటుంబాలు పెట్టుకున్నారు.

విశాఖలోని కుమారుడు తనవద్దకు రమ్మంటాడు కానీ- గుంటూరును, స్వంత ఇంటిని వదిలిపెట్టలేని తత్వం రాఘవరావుది.

తమ మానాన తాము "కృష్ణా-రామా" అనుకుంటూ ఒదిగుంటున్నా- ఓ ప్రక్కకు తప్పుకుంటున్నా- ఏమాత్రం తమను పట్టించుకోని వైనం. ఆపైకొన్ని సందర్భాల్లో అన్నింటికీ 'వీరే'మూలం అన్న నీలాపనిందలు కూడా మోయడం జరిగింది. ఇందులో ఎవ్వరినీ తప్పుపట్టలేని పరిస్థితి. ఎవరి వాదనలు వారివి. ఎవరి అభిప్రాయాలు వారివి. కాలం మనస్తత్వాల్లో తెచ్చే మార్పులే అంత!

ఎవరిదారిన వాళ్ళు టౌన్లోనే వేరుగా.

ఈ నేపథ్యంలో ఆ దంపతుల్లో భాగ్యమ్మగారు మీరు ఏకాంతం ఐపోయింది. ఒంటరిగా మిగిలిపోయింది. వ్యధా భరితురాలే ఐంది.

రాఘవరావుగారి మీద తన రిటైర్మెంట్ ప్రభావం గానీ, కుటుంబ గొడవలు, వేరు కాపురాలు ఏమంతగా ప్రభావం చూపలేదు.

కారణం ఆయన గ్రంథకర్తగా, వేదాంతిగా పౌరాణికుడిగా కూడా అదనపు క్వాలిఫికేషన్స్ ఉన్నాయి కాబట్టి, అవే లోకమయ్యాయి.

అందరూ ఉండి ఏకాకులుగా వారిద్దరే!

నల్గురి దృష్టిలో- "ఇదేమిటి?- ముసలివాళ్ళను ఒదిలేసి ఎవరికివారు?" అన్న చందం.

> **పె**ద్దల అవసరాలు కాలగమనంలో తెలుస్తాయి. పిల్లలను పెంచి పెద్దచేసి ప్రయోజకులుగా తీర్చి దిద్దడం మన బాధ్యత. సమర్ధవంతంగా నెరవేర్చాం. వారు మనకు దూరమయ్యారనుకోవడం వివేకం కాదు. కాల మహిమ అది.

పువ్వులమ్మిన చోటే కట్టెలమ్మాల్సి వచ్చిన పరిస్థితి.

అందరూ విద్యావంతులే. ఒకరికి మంచిచెడు చెప్పగల్గిన వాళ్ళే పైగా.

కానీ స్వంత విషయంలో తమకు తోచిందే న్యాయమని భావించారు.

తనకు జరుగుబాటుకు ఏం బాధలేదు. కొడుకులనుండి ఏనాడూ ఏమీ ఆశించలేదు ఆ దంపతులు. తను గుంటూర్లో సంపాదించుకున్న డాబా- పై అంతస్థు తనకు చాలు. పెన్షన్ ఉంది.

అట్లని మమకారాలు! బంధుత్వాలు మరుగైపొయ్యాయా? అంటే అదేమీ అంతగా కన్పించదు. రాకపోకలు ఏదో జరిగిపోతూండటం రివాజైంది.

భాగ్యమ్మగారికి ఈ వయసులో 'తాము' ఏకాకులు కావటం పెనుబాధగా మారిపోయింది. నిరుత్సాహం- నిర్వేదం ఆవహించాయి.

క్షేత్రాలు తిరిగినా- తీర్థాలు సేవించినా మనశ్శాంతి ఏమేరకు?

"అడ్డాలనాడు బిడ్డలు గానీ- గడ్డాలనాడు కాదుగా!"అన్న సామెత రాఘవరావు దంపతుల విషయంలో నిలువెత్తు సాక్ష్యంగా ఉండింది.

గమ్మత్తైన విషయం ఏమిటంటే-

అందరికీ తాము కావాల్సిందే- కానీ కాస్తంత దూరంగా-

'తమ'కు అందరూ ఉన్నట్లే ఉన్నారు. కానీ తామొక్కరే! నన్న చందం. నాటకం కాని నాటకం. అంతర్నాటకం. ఉమ్మడి కుటుంబాల్లోని వింత పోకడలు! అందరి విషయంలో కాకపోయినా- ఈ వృద్ధాప్య దశలో 'తమ'కు ఇలా పరిస్థితి వాటిల్లింది.

రాఘవరావు- తను వేదాంతి. తత్వాలను, స్వభావాలను తెల్సినవాడు. ఎవ్వరికీ ఏమీ అనలేని, అడగలేని, చెప్పలేని, మనస్తత్వం. సర్దుకుపోగలడు. కానీ భాగ్యమ్మకు ఆశలుంటాయి కదా!

చూస్తూండగానే ఎవరి పాత్రలను వారు పండించుకున్నారు.

ఓ అంకం, మరో అధ్యాయం ముగిసింది. తనకు గ్రంథాలు, రచనలు, సభలు నేస్తాలు. మరి భాగ్యమ్మగారికి ఎవరు నేస్తాలు!?

* * *

ఎద్దులబండి తార్రోడ్డు దిగి ఊళ్ళోకెళ్ళే మట్టిరోడ్డు, వాగు త్రోవలోకి రావడంతో ఓ కుదుపు. బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు రాఘవరావు.

ఏదో దీర్ఘాలోచనలో భాగ్యమ్మ. చీకట్లు మెల్లగా తొంగి చూస్తున్నాయి. అల్లంత దూరాన చెట్ల గుబురుల మధ్య తన ఊరు. తమను ఆహ్వానిస్తున్నట్లుగా ఊర్లోని కరెంటు స్థంభాల లైట్లు గుప్పుమని వెలిగాయి.

'అదుగోండి...గంగానమ్మ గుడి దగ్గరికొచ్చేశాం" నాగిరెడ్డి అన్నాడు.

అప్పుడెలా ఉందో ఇప్పుడలానే ఉంది. నాలుగు పెద్ద రాతి బండలతో నిర్మితం. ముందువైపున రాతి ధ్వజ స్థంభం. ప్రక్కనే పెద్ద చింత చెట్టు. "బండి ఆపు" అన్నాడు రాఘవరావు.

"రా... భాగ్యం... అలా గుళ్ళోకి వెళ్ళొద్దాం" అంటూ దిగాడు.

చెయ్యందించి భాగ్యమ్మను దించాడు.

గుడికి తలుపులు లేవు. గ్రామదేవత. విగ్రహంముందు ప్రమిదలో దీపం వెల్గుతోంది.

"చల్లని తల్లి... ఊరును కాపాడే తల్లి. నా చిన్నప్పుడు ఊర్లో కొలుపులు, జాతర్లు జరిగేవి. ఈ గుడి దగ్గరకు రావాలంటే నాకు భయం ఆ రోజుల్లో.

నా బాల్యమంతా ఇక్కడే. ఆటలు, పాటలు, నేస్తాలతో ఆ చింత చెట్టు క్రిందనే ఆటలు.

ముచ్చట్లు చెప్పుకుంటూ బండిదగ్గరకు నడుస్తున్నారు. ఉన్నట్టుండి రాఘవరావు అన్నాడు. "చూడు. భాగ్యం నీ మనస్సు నాకామాత్రం తెలీకుండానే ఉందా! నీవు అక్కడ కోల్పోయిన అనురాగం, ఆత్మీయతలు ఇక్కడ పొందుతావు. నీకు ఒంటరితనం ఉండదు.

వాళ్ళకీనాడు విడిగా ఉంటేనే సుఖమనుకుంటున్నారు. డబ్బు వ్యామోహం, తమవరకు తాము అన్న తమకం ఎన్నాళ్ళుంటుంది చెప్పు.

పెద్దల అవసరాలు కాలగమనంలో తెలుస్తాయి. పిల్లలను పెంచి పెద్దచేసి ప్రయోజకులుగా తీర్చిదిద్దడం మన బాధ్యత. సమర్ధవంతంగా నెరవేర్చాం. వారు మనకు దూరమయ్యారనుకోవడం వివేకం కాదు. కాల మహిమ అది. ఏనాటికైనా 'సంస్కారం'అన్నది వాళ్ళకు కనువిప్పు గల్గిస్తుంది. అయితే కొంతకాలం గ్రహణం ఉండటం సహజమే.

నీ, మనోవ్యాకులతకు మందు, ఈ గ్రహణ కాలంలో- మనకానందం గల్గించే, మన వూరి జీవనమే. అయినా మనకేం లోటు చెప్పు! స్వంత వూరు కన్నతల్లి లాంటిది. ఇక్కడ ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసాను. మళ్ళీ క్రొత్త జీవితం మొదలెడదాం. ఇదొక అనుభవం అనుకో. మనకు ఎవరో తోడు ఎందుకు. "నీకు నేను- నాకు నీవు"భుజంమీద చెయ్యివేసాడు అనునయంగా. భాగ్యమ్మ ప్రశాంతంగా భర్త ముఖంలోకి చూసి నవ్వింది.

నిజమేనన్నట్లుగా ఊరుమధ్యలోని రాములవారి గుడి గంటలు మ్రోగాయి. మ్రోగుతూనే ఉన్నాయి.

ఎద్దులబండి ఊర్లోకి ప్రవేశించింది. ఆకాశంలో చుక్కలు తొంగిచూస్తున్నాయి. ★